క్లుప్తంగా

క్రమశిక్షణతో ఆరోగ్యకర జీవితం



కాపవరంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, అంగన్‌వాడీ సిబ్బంది

బిక్కవోలు: విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడకుండా క్రమశిక్షణతో ఆరోగ్యకర జీవితం గడపాలని కాపవరం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పప్పు గోపాలకృష్ణ అన్నారు. శుక్రవారం కాపవరం అంగన్‌వాడీ సిబ్బంది ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే భవిష్యత్తు నాశనమవుతుందన్నారు. వాటి వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు వైబీఎస్ ఆచార్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు జి.ఝాన్సీ, జి.సువర్ణ, కె.నాగరత్నం పాల్గొన్నారు.

70 శాతం వరినాట్లు పూర్తి

బిక్కవోలు: మండలంలోని 70 శాతం వరి నాట్లు పూర్తి అయినట్లు వ్యవసాయశాఖ ఏవో శామ్యూల్ జాన్ అన్నారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ మండలంలో 15 వేల ఎకరాల ఆయకట్టు ఉందన్నారు. దీనిలో దాదాపు 95 శాతం స్వర్ణ రకం, మిగిలిన ఐదుశాతంలో ఎంటీయూ 1318 బొండాలు వేస్తున్నారన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన అవసరం



కరకుదురులో ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి

పెదపూడి: గ్రామాల్లో ప్రజలు తడి, పొడి చెత్తపై అవగాహన పెంచుకోవాలని డిప్యూటీ ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసే విధానంపై శుక్రవారం కరకుదురు గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ క్లాప్ మిత్రాలు తడి, పొడి చెత్తను సేకరించి, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలిస్తారన్నారు. అక్కడ ఎరువుగా తయారీ చేసి రైతులకు విక్రయిస్తారన్నారు. తద్వారా పంచాయతీకి అదనపు ఆదాయం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శి బి.ప్రసన్న ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు విద్యుత్‌కు అంతరాయం

రాజానగరం: సంపత్ నగరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని బొమ్మూరు – సంపత్ నగరం 33 కేవీ ఫీడర్‌పై వార్షిక మరమ్మతులు నేపథ్యంలో ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం రూరల్ ఇన్‌చార్జ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్.శామ్యూల్ తెలిపారు. ఆ సమయంలో కొండగుంటూరు ఎస్ఎస్ పరిధిలోని అన్ని రకాల విద్యుత్ సర్వీసులకు సరఫరా ఉండదన్నారు.

ఆకట్టుకుంటున్న అంతర్జాతీయ ఎక్స్‌పో



అంతర్జాతీయ ఎక్స్‌పోలో ఆకట్టుకుంటున్న ఏసీలు, ఇతర ఎలక్ట్రానిక్స్ వస్తువులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నగరంలోని జేకే గార్డెన్స్‌లో ఐఐసీఎఫ్‌అండ్ సత్య ఏజెన్సీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఎలక్ట్రానిక్ షోరూమ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ ఎక్స్‌పో ఆకట్టుకుంటోంది. ఈ ఎక్స్‌పో ఈ నెల 30 వరకూ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. సత్య ఏజెన్సీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు దేశంలో 350కి పైగా ఎలక్ట్రానిక్స్ షోరూమ్‌లు, మన రాష్ట్రంలో 60కి పైగా ఉన్నాయి. స్థానిక ఏవీ అప్పారావు రోడ్డులో బ్రాంచ్ కూడా ఉంది. ఎక్స్ పోలో అనేక ఆఫర్లు అందుబాటులోకి తీసుకువచ్చారు.

- సత్య లక్కీ డ్రాలో ప్రతిరోజూ మొబైల్ గెలుచుకోవచ్చు. మొబైల్స్, ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్లు, ఎల్ఈడీ టీవీలు, కిచెన్ అప్లయన్సెస్ (వంటగది ఉపకరణాలు), ఓఎల్ఈడీ టీవీలు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు, కుట్టుమెషీన్లపై ప్రత్యేక డిస్కౌంట్ ఇస్తున్నారు.
- ఎస్వీ మోటార్స్ ఆటో ఎక్స్‌పో కూడా ఇక్కడే జరుగుతోంది. దీనిలో మారుతి, అరేనా, నెక్సా కార్లను ప్రదర్శనకు ఉంచారు. బలేనో, ఫ్రాంక్స్ అన్ని వేరియంట్లపై 100 శాతం రోడ్ టాక్స్ మినహాయింపును అందిస్తున్నారన్నారు.
- ఎంఅండ్ఎమ్ మోటార్స్ థార్ రాక్, ఎక్స్ఈవీ 9ఈ ఈవీ వాహనాలను ప్రదర్శిస్తోంది. ప్రతి రోజు ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ఎక్స్‌పో జరుగుతోంది.

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు

పెదపూడి: సంపరలోని విజయ దుర్గాదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు హనుమంతాచార్యులు మాట్లాడుతూ ఆషాఢ మాసం కావడంతో నిత్యం వారాహి నవరాత్రుల పూజలు నిర్వహిస్తున్నామన్నారు.

వరిలో నారుమడి కీలకం

- జోరుగా ఖరీఫ్ పనులు
- బిజీగా అన్నదాతలు
- గ్రామాల్లో సందడి



శాస్త్రవేత్త వెంకట నరసింహరావు



వెలుగుబందలో నారుమడిని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

రాజానగరం: నియోజకవర్గంలో రైతాంగం ఖరీఫ్ వరి సాగులో నిమగ్నమైంది. అడపా దడపా కురుస్తున్న వర్షాలతో బోర్లు సదుపాయాలు లేని చోట కూడా పొలాలను దుక్కులు చేసి, నారుమడులు కట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వరిసాగులో మంచి దిగుబడులు సాధించాలంటే నారుమడి నుంచి సరైన యాజమాన్య పద్ధతులను అనుసరించాలని దివాన్ చెరువులోని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. తక్కువ కాల వ్యవధితో కూడిన విత్తనాలను సేకరించి, మొలక శాతాన్ని పరీక్షించిన తరువాత విత్తన శుద్ధి చేసిన విత్తనాలను మడులలో విత్తనాలు చల్లాలన్నారు. ఇలా కొద్దిపాటి మెళకువలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చంటూ శాస్త్రవేత్త డాక్టర్ చల్లా వెంకటనరసింహరావు తెలిపారు.

వరిలో విత్తన శుద్ధి

ఒక కిలో విత్తనానికి కార్బన్డిజమ్ 25 శాతంతో పాటు మాంకోజెబ్ 50 శాతం మిశ్రమ శిలీంద్ర నాశని 2 గ్రాములు తీసుకుని విత్తన శుద్ధి చేయాలి. అదే పొడి విత్తన శుద్ధికి శిలీంద్రనాశని 4 గ్రాములు అవసరం అవుతుంది.

నారుమడి యాజమాన్యం

నారుమడికి ఎంపిక చేసిన పొలాన్ని 10 నుంచి 12 రోజుల వ్యవధిలో మూడు దఫాలు దమ్ము చేసి చదును చేయాలి. ఐదు సెంట్లలో వేసే నారుమడికి 2 కిలోల నత్రజని (విత్తనం విత్తేముందు ఒక కిలో, విత్తన 10 – 14 రోజులకు మరో కిలో), ఒక కిలో భాస్వరం, ఒక కిలో పొటాష్ నిచ్చే ఎరువులను దుక్కిలో వేయాలి. విత్తన శుద్ధి చేసి, మొలక కట్టిన విత్తనాన్ని సెంటుకు ఐదు కిలోలు చొప్పున తీసుకుని మడిలో చల్లాలి. ఈ సమయంలో జింకు లోపాన్ని గమనిస్తే 2 గ్రాముల జింకు సల్ఫేట్ ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయడం మంచిది. తర్వాత పది రోజులకు కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు సెంటుకు 160 గ్రాములు లేదా మోనోక్రోటోఫోస్ 1.6 మిల్లీలీటర్లు, లేదా క్లోరిఫైరిపాస్ 2.5 మిల్లీలీటర్లను ఒక లీటరు నీటిలో కలిపి నారుమడిపై 10వ రోజు, 17వ రోజు పిచికారీ చేయాలి. అలాగే నారు తీయడానికి వారం రోజుల ముందు సెంటు నారుమడికి 160 గ్రాముల కార్బోఫ్యూరాన్ గుళికలు వేసి, పలచగా నీరు పెట్టాలి. 5 సెంట్లలో కట్టిన నారుమడిలో దమ్ములో 2.2 కిలోల యూరియా, 6.25 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 1.6 కిలోల మ్యూరేట్ ఆఫ్ పోటాష్ వేయాలి. జింకు లోపం నివారణకు ఆఖరి దమ్ములో ఎకరానికి 20 కిలోలు జింక్ సల్ఫేట్ వాడవచ్చు.

క్యూఆర్ కోడ్‌పై విస్తృత ప్రచారం చేయాలి

- చంద్రబాబు మోసాన్ని ప్రజలకు తెలపండి
- వైఎస్సార్ సీపీ శ్రేణులతో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి



మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి



మేనిఫెస్టో క్యూఆర్ కోడ్

అనపర్తి: సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అవలంబిస్తున్న నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతూ వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేసిన క్యూఆర్ కోడ్‌పై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని పార్టీ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సూచించారు. అనపర్తిలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. నేడు ప్రతి ఒక్కరి దగ్గర స్మార్ట్ ఫోన్ ఉన్న నేపథ్యంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలు, వారు చేస్తున్న మోసాలను మరోసారి ప్రజలకు గుర్తు చేయాలన్నారు. హామీల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి క్యూఆర్ కోడ్ ఎంతో ఉపకరిస్తుందన్నారు. 2024 ఎన్నికలకు కూటమి ఇచ్చిన హామీల మేనిఫెస్టో, మభ్య పెట్టే వాగ్దానాలతో చంద్రబాబు సంతకం చేసిన బాండ్లు, బాబు మోసాల్ని ఎండగడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహనరెడ్డి ప్రెస్ మీట్, తదితర అంశాలు ఈ కోడ్‌లో కళ్లకు కట్టినట్టు వివరించారన్నారు. వీటిని ప్రజలకు చేరువ చేయడం ద్వారా కూటమి చేస్తున్న మోసాలను వారికి తెలియజేయవచ్చన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు పుస్తకాల పంపిణీ



వేండ్రలో చిన్నారులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న గ్రామ పెద్దలు

పెదపూడి: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను చిన్నారులు, బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలు సద్వినియోగం చేసుకోవాలని కాకినాడ అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సంపర సెక్టార్ సూపర్ వైజర్ శ్రీపద్మ అన్నారు. సంపర, వేండ్ర గ్రామాల్లో చిన్నారులకు పీపీ–1, పీపీ–2 పుస్తకాలను గ్రామ పెద్దల చేతుల మీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. ఐదేళ్లు నిండి ప్రాథమిక పాఠశాలల్లో చేరిన పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి ప్రీ స్కూల్ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల తల్లులందరికీ నవచేతన ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. శ్రీపద్మ మాట్లాడుతూ పిల్లల బ్రెయిన్‌లో ప్రేరణ కలిగించే అంశాలకు అవకాశాలు కల్పిస్తూ తల్లిదండ్రులు శ్రద్ధ వహించి, జాగ్రత్తలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పెద్దలు నాగిరెడ్డి వీరస్వామి, తిబిరిశెట్టి ఆదినారాయణ, ఎరుబండి రామచంద్రమూర్తి, ఆచంట శ్రీనివాసు, నర్ల భాస్కరరావు పాల్గొన్నారు.

ఎరువులను పరిమితికి మించి వాడితే అనర్థమే



మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి భీమరాజు

రాజమహేంద్రవరం రూరల్: ఖరీఫ్ సీజన్‌లో పంటల దిగుబడి పెంపు కోసం రైతులు శాస్త్రీయ పద్ధతిలో ఎరువుల వినియోగాన్ని అవలంబించాలని మండల వ్యవసాయ అధికారి ఏ.భీమరాజు సూచించారు. అంతర్జాతీయ సహకార సంవత్సరం 2025 సందర్భంగా తొర్రేడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సంఘ సభ్యులు, రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భీమరాజు మాట్లాడుతూ ఎరువులను అధికంగా వినియోగిస్తే పంటలకు నష్టం జరుగుతుందని, మట్టిలో పోషకాల సమతుల్యత నాశనం కావొచ్చని హెచ్చరించారు. ముందుగా మట్టి పరీక్షలు చేయించుకుని, దాని నివేదిక ఆధారంగా ఎరువుల మోతాదులను నిర్ణయించుకోవాలన్నారు. వ్యవసాయ అధికారుల సలహాతో సరైన మోతాదులో ఎరువులు వేయాలని, నీమ్ యూరియా వాడకాన్ని ప్రోత్సహించాలన్నారు. అనంతరం ఎరువుల వాడకంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. జిల్లా సహకార అధికారి వెంకట రమణ మాట్లాడుతూ సేంద్రియ ఎరువులు వినియోగం పెంచడం వల్ల నేల జీవశక్తి పెరుగుతుందన్నారు. జీవామృతం, పంచగవ్యం, కంపోస్ట్, వర్మీ కంపోస్ట్ వంటి వాటిని యాంత్రిక ఎరువులతో పాటు వాడితే నేల ఫలదాయకత మెరుగవుతుందన్నారు. నకిలీ ఎరువులతో దిగుబడులు తగ్గిపోవడమే కాకుండా, సారవంతమైన భూమి నాశనం అవుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార ఆడిట్ అధికారి జగన్నాథరెడ్డి పాల్గొన్నారు.

ప్రొటోకాల్‌కు అధికారుల తిలోదకాలు



పెదరాయవరంలో ఏర్పాటు చేసిన శిలాఫలకంపై కనిపించని మండల కో ఆప్షన్ సభ్యుడి పేరు

రంగంపేట: గ్రామాల్లో ఏ ప్రభుత్వ కార్యక్రమం చేపట్టినా ప్రొటోకాల్ ప్రకారం మండల, స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుంది. కానీ రంగంపేట మండల అధికారులు మాత్రం దీనికి భిన్నంగా వ్యవహరిస్తున్నారు. కూటమి ప్రభుత్వ ఏర్పడినప్పటి నుంచి ఆయా పార్టీల నాయకుల అడుగులకు మడుగులు ఒత్తుతూ, ప్రజాస్వామ్య బద్ధంగా ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారిని పట్టించుకోవడంలేదు. ఈ నెల 25వ తేదీన పెదరాయవరంలో జలజీవన్ మిషన్ నిధులతో ఓహెచ్ఆర్ ట్యాంక్ నిర్మాణం, తాగునీటి కుళాయిలు, పైపులైన్ల ఏర్పాటుకు రూ.65 లక్షల నిధులతో శంకుస్థాపన చేశారు. అయితే అక్కడ ఏర్పాటు చేసిన శిలాఫలకంపై మండల కో ఆప్షన్ సభ్యుడు సిద్దుల వంశీధర్ పేరు లేకపోవడం ఆశ్చర్యం కలిగించింది. దీంతో అధికారుల తీరుపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఫొటోతో జ్ఞాపకాలు పదిలం



కోరుకొండ మండల ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ నాయకులు

కోరుకొండ: ప్రజల జ్ఞాపకాలను పదిలం చేసేది ఫొటో అని ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కోరుకొండ మండల అధ్యక్షుడు కట్టా వీర సూరిబాబు అన్నారు. కాపవరంలోని ఆదిత్య ఫంక్షన్ హాలులో శుక్రవారం ఫొటోగ్రాఫర్స్ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన వీరసూరి మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న సంఘటనలను ఫొటోగ్రఫీ ద్వారా ప్రజల ముందుంచడం జరుగుతోందన్నారు. తొలుత ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వీరసూరి మాట్లాడుతూ ఫొటో, వీడియోగ్రాఫర్లు ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. నిర్మాణ దశలో ఉన్న అసోసియేషన్ భవనాన్ని పూర్తి చేయడానికి కృషి చేస్తానన్నారు. మండల ఉపాధ్యక్షుడుగా బచ్చ కనక రాజు, కార్యదర్శిగా ఆకుమూరి స్వాతి, సహ కార్యదర్శిగా చింతాట విశ్వేశ్వరరావు, కోశాధికారిగా నల్లల ధర్మాజీ ఎంపికయ్యారు. వీరందరినీ పాత కమిటీ నాయకులు శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు సాధు, వెంకట్, రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు పల్లెల కొండలు, కోశాధికారి కె.శ్రీనివాసరావు, రాజమండ్రి అధ్యక్షుడు సిరీ శ్రీను, కార్యదర్శి లీలా నాగు, పెద్దలు రావు అండ్ రావు పాల్గొన్నారు.

నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి



తహసీల్దార్ సీతాపతిరావును సన్మానిస్తున్న రేషన్ షాపుల డీలర్లు

పెదపూడి: రేషన్ షాపులను నిర్వాహకులు నిబంధనల ప్రకారం నిర్వహించాలని తహసీల్దార్ పీవీ సీతాపతిరావు అన్నారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం ఆయనను రేషన్ షాపుల అసోసియేషన్ ప్రతినిధులు సత్కరించారు. శాలువ కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. రెవెన్యూ దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ తహసీల్దార్‌గా సీతాపతిరావు అవార్డు పొందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా రేషన్ షాపుల అసోసియేషన్ నాయకులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. సీతాపతిరావు మాట్లాడుతూ షాపుల వద్ద ధరలు, సరకు వివరాలు, సమయ పాలనను తెలియజేసే ప్రదర్శన బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించేవారిపై తగిన చర్యలు చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో మండలంలోని 42 రేషన్ షాపు నిర్వాహకులు పాల్గొన్నారు.

మిషన్ వాత్సల్యతో ఆర్థిక భరోసా



సుమమణికి చెక్కు అందజేస్తున్న ఎంపీ పురందేశ్వరి తదితరులు

సీటీఆర్ఐ: కోవిడ్ వల్ల మృతి చెందిన వారి పిల్లలకు మిషన్ వాత్సల్య ద్వారా ఆర్థిక భరోసా అందిస్తున్నామని ఎంపీ పురందేశ్వరి అన్నారు. స్థానిక పోలీసు కల్యాణ మండపంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్య చౌదరి లబ్ధిదారుకు చెక్కును అందజేశారు. ఎంపీ మాట్లాడుతూ కోవిడ్ సమయంలో అనాథలుగా మారిన పిల్లలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అండగా నిలిచారని, వారి కోసం పీఎం కేర్ పథకాన్ని ప్రవేశపెట్టారని చెప్పారు. దీనిలో భాగంగా కోవిడ్ సమయంలో తల్లిని పోగొట్టుకుని అనాథగా మారిన సుమమణికి ఇప్పుడు 23 ఏళ్లు రావడంతో రూ.10 లక్షలు చెక్కు అందజేశామన్నారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ తల్లిదండ్రులను కోల్పోయిన సుమమణికి ప్రతి నెలా రూ.4 వేలు ఆర్థిక సాయం అందజేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా సుమమణి మాట్లాడుతూ తల్లిదండ్రులు లేని లోటును కేంద్ర ప్రభుత్వం తీర్చిందని చెప్పారు. తాను ఏడో తరగతిలోనే తండ్రిని, కరోనా రెండో విడతలో తల్లిని కోల్పోయినట్లు చెప్పారు. పీఎం కేర్ ద్వారా తాను చదువు కొనసాగించి నర్సింగ్ పూర్తి చేయగలిగానన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

భవిత కేంద్రం పరిశీలన



రంగంపేట భవిత కేంద్రంలో విద్యార్థులను పరిశీస్తున్న ఐఈ కో ఆర్డినేటర్ కన్నబాబు

రాజానగరం: ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని, వారికి మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతోనే భవిత కేంద్రాన్ని దివాన్ చెరువు పాఠశాల నుంచి రాజానగరం–1 పాఠశాలకు మార్పు చేశామని సమగ్ర శిక్ష, జిల్లా సహిత విద్య కో ఆర్డినేటర్ కన్నబాబు తెలిపారు. స్థానిక భవిత కేంద్రాన్ని శుక్రవారం సందర్శించిన ఆయన రికార్డులను పరిశీలించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు కేంద్రం ద్వారా అందిస్తున్న ఫిజియోథెరపీ సేవలపై ఆరా తీశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థులు తమ శారీరక లోపాలను అధిగమించి, వారి పనులు వారే చేసుకునే విధంగా శిక్షణ ఇవ్వడంతో పాటు, శరీర దృఢత్వాన్ని వృద్ధి చేసేలా ప్రతి శుక్రవారం ఫిజియోథెరపీ శిబిరాలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు రామన్నదొర, జ్యోతిప్రసాద్, ఐఆర్‌టీ ఉపాధ్యాయుడు సురేష్, సీఆర్పీలు పాల్గొన్నారు.

ప్రథమ స్థానంలో రంగంపేట భవిత కేంద్రం

రంగంపేట: ప్రత్యేక అవసరాలు గల పిల్లలను తీర్చిదిద్దటంలో రంగంపేట భవిత కేంద్రం జిల్లాలో ప్రథమ స్థానంలో ఉందని ఐఈ కో ఆర్డినేటర్ ఎస్.కన్నబాబు అన్నారు. ఆ కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీఎల్ఎం కిట్లు, ట్యాబుల వినియోగంలో విద్యార్థులు, ఉపాధ్యాయుల కృషిని అభినందించారు. విద్యార్థుల నమోదు, హాజరు నిలకడకు కృషి చేస్తున్న కేంద్ర నిర్వాహకులు, ఐఈ ఆర్‌టీలు ఎంవీఎస్ ప్రసాద్, జి.అంజలి కృషిని అభినందించారు. రికార్డులు, విద్యాబోధనను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి పి.మధుసూదనరావు, సీఆర్ఎంటి శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

జగన్నాథునికి జేజేలు

- వైభవంగా జగన్నాథ రథయాత్ర
- ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహణ
- భారీగా తరలివచ్చిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో బలరామ, సుభద్ర, జగన్నాథులు



జగన్నాథ రథయాత్రను తిలకించడానికి భారీగా వచ్చిన భక్తులు



రథంపై ఊరేగుతున్న మూలవిరాట్లు

సీటీఆర్ఐ: ఇస్కాన్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలో జగన్నాథ రథయాత్ర అత్యంత వైభవంగా జరిగింది. స్వామి వారిని దర్శించుకునేందుకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. సాధారణంగా రథయాత్ర అంటే ఉత్సవ మూర్తులను ఊరేగిస్తారు, కానీ జగన్నాథస్వామి రథయాత్రలో మూలవిరాట్లను ఊరేగించడం ప్రత్యేకత. మందిరానికి రాని వాళ్ల కోసం స్వామివారే స్వయంగా బయటకు వచ్చి దర్శన భాగ్యం కల్పించడమే జగన్నాథ రథయాత్ర విశిష్టత. ఈ నేపథ్యంలో కీర్తనలు, భజనల నడుమ బలరాముడు, సుభద్ర, జగన్నాథుని విగ్రహాలను రథంలో ఉంచి ఊరేగించారు.

రథయాత్ర సాగిందిలా..

నగరంలో జగన్నాథ స్వామి రథయాత్ర శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమైంది. శ్యామలానగర్ రామాలయం సెంటర్ నుంచి జాగృతి బ్లడ్ బ్యాంకు, దానవాయిపేట, జాంపేట, దేవీచౌక్, అల్లూరి సీతారామరాజు సెంటర్, లక్ష్మీవారపుపేట, కోటగుమ్మం సెంటర్, మెయిన్ రోడ్డు, కోటిపల్లి బస్టాండ్ సెంటర్, హెడ్ పోస్టాఫీసు, రైల్వే గూడ్స్ సెంటర్, మహాకాళేశ్వర ఆలయం మీదుగా ఇస్కాన్‌కు చేరుకుంది. రథయాత్ర ముగిసాక జగన్నాథస్వామి లీలలపై ప్రవచనం, 56 రకాల చప్పన్ భోగ నైవేద్యం, దీప హారతులు, అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఇస్కాన్ టీఎంసీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

1న 'పోలవరం' ముంపు గ్రామాల్లో సభలు నిర్వహించాలి

సీటీఆర్ఐ: ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జూలై ఒకటిన పోలవరం ముంపు గ్రామాల్లో సభలు నిర్వహించి, తద్వారా వీఎస్ఎస్ భూములకు పరిహారం నిర్ధారించాలని ఆదివాసీ మహాసభ న్యాయసలహాదారు అయినాపురపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2013లో ఇచ్చి జీఎంఎంఎస్ నెం.791 ప్రకారం జూలై ఒకటిన అధికారులు గ్రామ సభలు నిర్వహించాల్సి ఉందన్నారు. అయితే సమయం దగ్గర పడుతున్నప్పటికీ ఈ మేరకు గ్రామస్తులకు సమాచారం లేదన్నారు. పోలవరం ముంపు ప్రాంతాలలో విధిగా గ్రామసభలు నిర్వహించాలని, సుమారు 50 వేల వనసంరక్షణ సమితి (వీఎస్ఎస్) భూములకు నష్టపరిహారాన్ని సభ్యులకు చెల్లించాలన్నారు. సుమారు 45 వేల ఎకరాల వీఎస్ఎస్ భూముల విషయమై చర్యలు తీసుకోవాలన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 234 నివాస ప్రాంతాలకు చెందిన 38,957 మంది ఎస్సీ కులస్తులు, ఏలూరు జిల్లాలో 137 నివాస ప్రాంతాలకు చెందిన 19,911 మంది ఎస్సీ కులస్తులు కలిపి మొత్తం 58,868 మంది పోలవరం ప్రాజెక్టు వలన నిర్వాసితులవుతున్నారన్నారు. సమావేశంలో ఆదివాసీ మహాసభ ప్రెసిడెంట్ వెంకటస్వామి పాల్గొన్నారు.